Book Stall
ALL KINDS OF PAPERS &
MAGAZINES SUPPLIERS
CHINTAL BASTI, HYDERABAD-4

# 5. చీకటి

భోజనా లయాయి. రామచంద్రమూర్తి చెయ్యి తుడుచుకుంటూ, వరాండాలోకి వచ్చి కుర్చీలో కూచుని, పేపరు చదవడం ఆరంభించాడు. నాలుగు నిమిషాలలో సీతకూడా, వంటయింటి తలుపులు వేసుకొని, తమలపాకులూ, వక్కపొడి సీసా, సున్నపు సీసా తీసుకొని వచ్చి మూర్తిప్రక్కన కుర్చీలో కూచుంది. మూర్తి ఆమెవంక ఒకసారి చూసి, మళ్లీ పేపరు చదువులో లీనమయాడు.

సీత వక్కపొడి అందించింది. మూర్తి అందుకొని నోట్లో వేసుకున్నాడు. సీత, సున్నంరాసిన తమలపాకు చిలకను అందించింది. మూర్తి తలత్రిప్పి చూడకుండానే, చేత్తో చిలకను తీసుకొని నోట్లో వేసుకున్నాడు.

"అంత దీక్షగా చదువుతున్నారు, ఏమిటది?" అని అడిగింది సీత.

"ఏదో, నీ కర్థం కాదు" అని తలత్రిప్పి చూడకుండానే జవాబు చెప్పాడు మూర్తి.

"అక్కరలేని గొడవలు నాకెందుకుగాని, యివ్వాళ కూడా వెళ్లారు కాదేమండీ?" అంది సీత.

"ఎక్కడికి?" అని అడిగాడు, మూర్తి.

"ఎక్కడికా! రోజూ చెప్పాలికాబోసు. చెప్పి, చెప్పి నా గొంతుకి నొప్పివస్తోంది కూడాను. ఉన్న రెండుచీరెలూ చిరిగిపోయాయి. ఎవరు వచ్చినా, ఎదటబడడానికి సిగ్గేస్తోంది. ఇరవై రోజులనుంచి చెబుతూ వున్నాను. పోనీ, షాపుకి వెళ్ళడానికి మీకు తీరకపోతే, ఆ డబ్బేదో నాకిస్తే నేనే వెళ్ళి తెచ్చుకుంటాను. ఎన్నాళ్ళు యీ చింకిగుడ్డలతో గడపనూ....?" అంటూ, మరొక చిలకను అందించింది సీత.

జవాబు చెప్పకుండా, ఆ చిలకను నోట్లో వేసుకున్నాడు మూర్తి.

"మాట్లాడ రేమండీ! మీకు కావలసిన సూట్లూ, బూట్లూ మాత్రం నిమిషంలో అమర్చుకుంటారు గదా—" అని సీత కొంచెం జాలిమొహం పెట్టింది.

"నేను కాస్త మంచిబట్టలు కట్టుకుంటున్నాననేనా, నీ యేడుపు? ఏడుపు" అని విసుక్కున్నాడు మూర్తి.

"అవును. ఏడవక ఏంచేస్తాను? కాపురానికి వచ్చినప్పటినుంచీ, నా బ్రతుకు ఏడుపు బ్రతుకే అయింది. ఓ మంచి బట్ట చూశానా, అందమైన రవిక చూశానా! పైగా మెళ్ళోవున్న ఒక్క గొలుసూ, అయ్యగారిచేతుల్లో పెట్టినదాకా, అయ్యగారికి నిద్రే పట్టలేదు—" అని సీత అంటూ వుండగానే మూర్తి అందుకున్నాడు:

"సంసారానికి చాలకపోతే ఏం చెయ్యమంటావ్? పెళ్లాం మెళ్లో గొలుసు తీసుకోవడం, నేటికి నేనొక్కణ్ణే చేసినపని కాదు. తగినంత సంపాదించుకోలేని ప్రతివెధవా చేస్తూనే వున్నాడు. ఆ వెధవలలో నే నొకణ్ణి. వెధవని కనుకనే, సరైన సంపాదన లేకుండా పెళ్ళి చేసుకున్నాను. వెధవని కనుకనే, నువ్వన్న అడ్డమైన మాటలూ పడుతున్నాను. వెధవ పెళ్ళి, వెధవ సంసారమూను. ఛీ" అంటూ చేతిలో పేపరు నేలకు విసిరికొట్టాడు మూర్తి.

"నేనూ అలాగే అనుకుంటున్నాను—ఏ ట్రయినింగో చదువు కొని బ్రతక్కుండా, మానాన్న నన్నిలా చేశాడేమా, అని" అనేసింది సీత.

"నా కర్మం, నీ కర్మం. నాకొద్దు బాబూ అని ఎంత బ్రతిమాలినా వినక, ఈ సంబంధం తెచ్చి నాకంట కట్టాడు మా అన్నయ్య" అని బయటపెట్టాడు మూర్తి.

"ఇంకో సంబంధం చేసుకుంటే సుఖపడుదు రన్నమాట! ఆ దరిద్రపు ప్రొద్దు నా మొహాన్నే పొడిచిందన్నమాట! ఇలాటి వెధవ బ్రతుకు బ్రతకడంకంటె, ఏ నూతిలోనో, గోతిలోనో పడి చచ్చినా బాగుండును. ఏం సుఖపడుతానని, ఈ యింటిని అంటిపెట్టుకొని చావడం! వెధవ వంటలక్కలాగ బ్రతకడంకంటె చావడమే మేలు" అంది సీత.

విసుగులోనూ, కోపంలోనూ, సీత మొహంకేసి చూసి "చ స్తే
చావు, నీకు అడ్డమొచ్చినవా డెవడు యిక్కడ?" అనేశాడు మూర్తి.

సీతకు కోపం పట్టరానంతగా వచ్చింది. "ఎందుకు ఇలాటి వెధవ బ్రతుకు" అని దభాలున వీధి తలుపు తీసుకొని, ఛడేల్మని వేసేసుకొని సీత బయటికి వెళ్ళిపోయింది.

పది నిమిషాలలో ఇంత ఘోరమైన పరిణామం వచ్చిందేమి అని ఆలోచిస్తూ, దిగ్భ్రిమచెంది మూర్తి అలాగే, కుర్చీలో కూచున్నాడు.

ఒక నిమిషంకూడా గడవలేదు. మెల్లిగా తలుపు తెరుచుకొని సీత లోపలికి వచ్చింది.

మూర్తి తలయెత్తి, తెల్లపోతూ ఆమెవంక చూశాడు.

"బయటంతా, చీకటి గబ్బగీములాగ వుంది. ఏ దొంగ వెధవ లేనా తల పగల గొడతారేమో కూడాను" అంటూ పడక గదిలోకి వెళ్ళింది సీత.

---

# 6. యోగి - భోగి

"జై భగవాన్, జై" అంటూ యెవడో వచ్చి అరుగుమీద కూచున్న చప్పుడు విని రమణమ్మ తలుపు తీసి చూసింది. మూరెడు పొడుగుగడ్డం, జడలుగట్టిన జుట్టు, వొళ్ళంతా విభూతీ, కాషాయ గుడ్డలూ, బక్కచిక్కిన దేహం - కనిపించేటప్పటికి రమణమ్మకి వొళ్లు జలదరించింది.

రమణమ్మ తలుపు తీసేటప్పటికి, ఆ కాషాయాంబరధారి మళ్ళీ "జై భగవాన్, గురుదేవ్ జై" అన్నాడు. రమణమ్మ వీపుమీద యెవరో గ్రుద్దినట్లయింది.